ఆంధ్రజ్యోతి | ANDHRAJYOTHY | ఏలూరు జిల్లా వార్తలు | 5 | శుక్రవారం 5 జూలై 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0

ఇక నిర్మాణ రంగంలో.. జోష్



కొద్ది రోజుల్లోనే ఇసుక కష్టాలు తీరబోతున్నాయి. ఇన్నాళ్ళు ఇసుకకు ధరకట్టి ఒక వైపు జగన్ సర్కార్.. ఇంకోవైపు దళారులు ఇష్టానురాజ్యం చేశారు. కోట్లకు కోట్లు కొల్లగొట్టారు. గోదావరి ఇసుకతో పాటు వాగులు, వంకలను ఎక్కడా వదిలి పెట్టలేదు. అయినా ఇసుక సంతృప్తికర రీతిలో అందుబాటులో లేక పోయింది. ఫలితంగా.. నిర్మాణరంగం గడిచిన ఐదేళ్లలో కుప్పకూలి కోలుకోలేనంతగా దెబ్బ తింది. ఈ రంగాన్ని నమ్ముకుని ఉన్న వేలాది నిర్మాణ రంగ కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి, అప్పుల పాలయ్యాయి. కూటమి ప్రజా ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే గతంలో మాదిరి ఉచిత ఇసుక విధా నాన్ని తిరిగి అమలు చేయ బోతోంది. ఈ నిర్ణయం నిర్మాణరంగంలో కోటి ఆశలు పెంచింది.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

త్వరలోనే ఉచిత ఇసుక విధానం అమలు

- ఐదేళ్లు ఇసుక పేరిట నిలువు దోపిడీ
- అయినోళ్ళకే అంతా కట్టబెట్టారు
- కోలుకోలేనంతగా దెబ్బతిన్న నిర్మాణ రంగం
- లక్షలాది కుటుంబాలు ఎక్కడికక్కడ వలస
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కోలుకోనున్న రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం

అప్పనంగా ఇసుకను మేసేశారు

గడిచిన ఐదేళ్లల్లో అధికార పార్టీలో ఎవరుంటే వారిదే ఇష్టారాజ్యం. గోదావరి ఒడ్డున ఇసుక అక్రమంగా తరలించుకుపోవచ్చు. తమ్మిలేరు, ఎర్రకాల్వలో ఇసుక రాత్రికి రాత్రే టన్నులకొద్ది లాగించి వేయవచ్చు. దొరికినంత ఇసుకను అడ్డంగా మేసేయొచ్చు. దీనిని పర్యవేక్షించాల్సిన శాఖలు ఎక్కడికక్కడ గప్‌చిప్, అధికారుల చేతికి ఎంత... మాకెంత.... అనే రీతిలో ఇసుక పేరిట మాఫియా ముఠాలు చెలరేగిపోయాయి. అడ్డువస్తే తొక్కించుకుంటూ వెళ్లు అనే సూత్రాన్ని పాటించాయి. అక్రమ కేసులు బనాయించారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నించినా కుటుంబాలపై అధికార మదంతో పెచ్చరిల్లిపోయారు. పోలీసులు అక్రమార్కులను చూసీచూడనట్లుగా వదిలేసి వీరికి అడ్డు తగిలిన వారిపైనే ఎక్కడికక్కడ పెత్తనం చేశారు. ఇంత జరిగినా నిర్మాణరంగం ఎక్కడా ముందుకు పోలేదు. ఐదేళ్ల కాలంలో అన్నిరంగాల మాదిరిగానే నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతింది. ఈ మధ్యకాలంలో జరిగింది ఏమిటంటే జగనన్న కాలనీలకు సంబంధించి ఇసుక రవాణాను అడ్డంగా తరలించారు. పనిలో పనిగా తమకు అయిన వారికి మాత్రమే ఇసుకను అందుబాటులోకి తెచ్చారు. మిగతా వారిని అధిక ధరలతో వెక్కిరించారు. పదేపదే ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ఆ మేరకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ఒక రకంగా, బయట విక్రయించిన ధర ఇంకోరకంగా ఉండేలా చూసి ఆ మేరకు ప్రజా సొమ్మును దోచుకున్నారు. ఇంతలా వ్యవస్థను అపహాస్యం చేశారు. ఆఖరికి పోలవరం కుడి కాల్వలోనూ ఉన్న ఇసుకను, పట్టిసీమ డెలివరీ పాయింట్ వద్ద పేరుకు పోయిన ఇసుకను వదిలిపెట్టలేదు. ప్రత్యేక వాహనాలతో ఇసుకను తరలించారు. ఐదేళ్ల పాటు తమ్మిలేరులో ఇసుక దోపిడీ కొనసాగింది. దెందులూరు నియోజకవర్గంలో ఈ దందాకు అంతుపంతూ లేకుండా పోయింది. ఇసుక కోసం పడిన కష్టాలు గుర్తు తెచ్చుకుని ఇప్పటికి జనం బావుర మంటారు.

■ నిర్మాణ రంగ కార్మికులకు మంచి రోజులు

ఇన్నాళ్లు నిర్మాణ పనులు ఏమీ లేక చతికిలపడిన ఈ రంగంలో ఉన్న అనేక మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంఖ్య దాదాపు 2లక్షలకు పైబడే ఉంది. ఆయా కుటుంబాలు అన్ని ఇక్కడ పనులు లేక చాలావరకు హైదరాబాద్ వంటి నగరాలకు తరలిపోయారు ఇంకొన్ని కుటుంబాలైతే చేతినిండా పనిలేక పస్తులు ఉన్న దాఖలాలు లేక పోలేదు. దీనికితోడు జగన్ ప్రభుత్వంలో కార్మిక వెల్ఫేర్ బోర్డు పూర్తిగా నిర్వీర్యమైంది. కనీసం భవన నిర్మాణ కార్మికులను ఆదుకునే ధ్యాస అప్పట్లో ఆ ప్రభుత్వానికి లేకుండానే పోయింది. కాని ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తేనుండడంతో భవననిర్మాణ కార్మికరంగ కుటుంబాల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. తమ కుటుంబ సభ్యులు ఎవరూ ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సిన పనిలేదని, ఉన్నంతలోనే ఇక్కడి నిర్మాణాలు పుంజుకుంటే తమకు పనికి లోటు ఉండదన్న ఆకాంక్ష వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం కాంట్రాక్టర్‌లకు కూడా అతిగొప్ప రిలీఫ్‌గా భావిస్తున్నారు.

ఇప్పుడేం జరగబోతోందంటే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చకచకా అమలులోకి తెస్తోంది. నిన్నటికి నిన్న పెరిగిన పింఛన్ల పంపిణీ సాగింది. కొద్దిరోజుల్లోనే అందరికి ఉపయుక్తమైన ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెబోతోంది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే అటు నిర్మాణ రంగంలో, ఇటు కార్మికరంగంలో ఒక్కసారిగా సంతృప్తి వ్యక్తమైంది. ఇన్నాళ్ళు కుదేలైన నిర్మాణ రంగం ఇక ముందు నిలదొక్కుకోవడానికి అనుకూలంగానే తద్వారా లక్షలాది కుటుంబాలకు రోజువారి ఉపాధి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ వారంలోనే ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తేబోతున్నారు. ఇప్పటికి ఇప్పుడు పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులో లేకపోయినా ఉన్నంతలోనే నిర్మాణరంగంలో వినియోగదారులకు అనువుగా చర్యలు తీసుకోబోతున్నారు. ప్రత్యేకించి ఇసుకను ఉచితంగా ఇచ్చి రవాణా చార్జీలను ఆయా బాధ్యత గల వ్యక్తులే భరించేలా చర్యలు తీసుకోబోతున్నారు. వాస్తవానికి ఇప్పటికే వర్షాకాలం ఆరంభం కావడంతో అన్ని జలవనరులలోనూ ప్రవాహం పెరిగింది. ఇసుకను ఈ మూడునెలలు వెలికితీయడం అత్యంత దుర్లభమే. అయినప్పటికి ఉచిత ఇసుక విధానాన్ని తక్షణం అమల్లోకి తేవాలని కూటమి నిర్ణయించి, ఆ మేరకు తుది కసరత్తుకు దిగింది. ఇప్పటివరకు ఆయా ప్రాంతాల్లో నిల్వ చేసిన ఇసుకను కొత్త విధానంలోకి చేర్చి పంపిణీ చేయబోతున్నారు. జిల్లాలో పోలవరం సమీపాన ఉన్న గూటాలలోనే ఏకైక ఇసుక ర్యాంపు ఉంది. ఇవి తప్ప మిగతా ఎక్కడా ఈ జిల్లా పరిధిలో ఇసుక ర్యాంపులు లేనే లేవు. అయితే తమ్మిలేరు, ఎర్రకాల్వతో పాటు మరికొన్ని వాగుల్లోనూ అక్కడక్కడ పేరుకు పోయి ఉన్న ఇసుకను ఇప్పటికే ఎండ్లబండి ద్వారా తరలించి కొందరు సొమ్ము చేసుకున్నారు. తమ్మిలేరులో దెందులూరుకు చెందిన వైసీపీ అనుకూలురు ఈ ఐదేళ్ల ఎడాపెడా ఇసుకను బొక్కారు. కలెక్టర్ స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా అక్రమ ఇసుక రవాణాను ఆపలేకపోయారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కైకలూరు వంటి ప్రధాన ప్రాంతాల్లో నిర్మాణ పనులు గడిచిన ఐదేళ్లుగా మందకొడిగా సాగాయి. ఒక్క జగనన్న లేఅవుట్‌లో మాత్రమే ఇళ్ళనిర్మాణం కొంతలో కొంత పూర్తి చేయగలిగారు. మిగతా అన్నిచోట్ల ప్రైవేట్ వ్యక్తులు ఇళ్ల నిర్మాణం జోలికే వెళ్ళలేక పోయారు. ఇసుక కొరత కారణంగా ఇన్నాళ్లు నిర్మాణ వ్యయం రెండింతలైంది. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం ఒక్క ఏలూరు జిల్లాలోనే దాదాపు లక్షా 25 వేలకు పైగా నిర్మాణ పనులు ఎక్కడికక్కడ ప్రస్తుతానికి నిలిచే ఉన్నాయి. ఇప్పుడు ఇసుక అందుబాటులోకి వస్తుంది కాబట్టి ఇక్కడి నిర్మాణం పుంజుకునేందుకే అవకాశం ఉంది.

నూజివీడులో మామిడి మార్కెట్

- రైతుల సమస్యలపై సీఎంతో, మంత్రులతో చర్చిస్తా : మంత్రి పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, జూలై 4 : 'ఏడాదిలోగా నూజివీడు మార్కెట్ యార్డులో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తాం. ఇది ఏర్పాటైతే విజయవాడ మామిడి మార్కెట్ వ్యాపారులు రావడానికి సిద్ధంగా ఉన్నారు. మామిడి వ్యాపారులతో మరోసారి సమావేశమై వారికి కావాల్సిన సౌకర్యాలపై చర్చించి, వాటిని సమకూరుస్తాం. దీనిపై మంత్రులతోపాటు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సాధిద్దాం' అని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి హామీ ఇచ్చారు. నూజివీడు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన మామిడి రైతులు, అధికారుల సదస్సులో మంత్రి మాట్లాడారు. 'నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం రైతులకు ఉపయోగపడడం లేదు. సిబ్బంది లేరనే సాకులు చెప్పవద్దు. ఏం కావాలో చెబితే ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేస్తాం. ల్యాబ్ నుంచి క్షేత్రస్థాయికి రావాలి. రైతులకు మామిడి కాయ కట్టడానికి అవసరమైన కవర్లు, బ్లేడు చిక్కాలు, సబ్సిడీపై అందించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వాతావరణ ఆధారిత పంటల బీమాపై సీఎం దృష్టికి తీసుకువెళ్లి వచ్చే సీజన్‌కు బీమా అమలయ్యేలా కృషి చేస్తా. రెండేళ్లుగా మామిడి బ్లాక్ త్రిప్స్, పండు ఈగ ఉధృతితో తీవ్రంగా దెబ్బ తింటోంది. ఆదాయం లేని పంటలను రైతు సాగు చేసేందుకు సిద్ధపడడు. నేనే 40 ఎకరాల మామిడి తోటను తొలగించాను. అందరూ పామాయిల్ వైపు అడుగులు వేస్తే మామిడి మార్కెట్ పడిపోయే అవకాశం ఉంది. నూజివీడు మ్యాంగో హబ్‌ను కాంట్రాక్టర్ పూర్తిగా నిర్వీర్యం చేశాడు. అతని కాంట్రాక్ట్‌ను రద్దు చేసి రైతు సంఘాలు, ఉద్యాన శాఖ అధికారులు నిర్వహించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి' అని అధికారులను మంత్రి ఆదేశించారు. నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, చిట్నేని శివరామకృష్ణ, కె.విజయ్ బాబు, పారిశ్రామికవేత్త కోటగిరి శ్రీనివాస్, జగ్గవరపు వెంకటరెడ్డి, శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి, ఉద్యానవన శాఖ ఏడీ వెంకటేశ్వర్లు, జేడీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మామిడి రైతులు

ఎర్ర కాల్వ నీటి విడుదల

- రైతులకు సహకారం అందిస్తాం : ఎమ్మెల్యే రోషన్



ఎర్రకాల్వ జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, జూలై 4 : రైతులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయం నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా గురువారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 80.20 మీటర్ల నీరు నిల్వ ఉంది. కుడి ప్రధాన కాల్వకు 30 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాల్వకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం హయాంలో ఎర్ర కాల్వ జలాశయాన్ని పట్టించుకోలేదు. ప్రాజెక్టుకు కనీస మరమ్మతులు చేయించలేదు. ఎర్రకాల్వ జలాశయ ప్రాంతాన్ని టూరిస్టు ప్రదేశంగా అభివృద్ధి చేస్తాం. ఇరిగేషన్ అధికారుల వద్ద మరిన్ని విషయాలను తెలుసుకుని ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తా' అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, నాయకులు పెనుమర్తి రామకుమార్, పారేపల్లి రామారావు, సాయిల సత్యనారాయణ, కె.మాధవరావు, ఉండవల్లి శ్రీను, రావూరి కృష్ణ, కొడవటి సత్తిరాజు, ఇరిగేషన్ డీఈ రాంబాబు, ఏఈ భాస్కరరావు, సీఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు (ఫైల్)

విలీనం..వంచన

- జగన్ సర్కార్ నిర్వాకంతో హక్కులు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు
- కార్పొరేషన్‌లో ఉన్న హక్కులు, స్కీమ్‌లు విలీనంతో రద్దు
- ఇప్పుడు కార్మికుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..

ఏలూరు రూరల్, జూలై 4 : తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్నట్లుగా ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. విలీనమైతే కష్టాలు అన్ని తీరతాయని ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా సమానంగా వేతనాలు అందుతాయని ఆశపడ్డారు. వైసీపీ పాలకుల నిర్ణయంతో అప్పట్లో ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. వారి సంబరాలు ఎంతో కాలం నిలువ లేదు. విలీనం కోరుకుని ఎంత తప్పుచేశారో తెలియడానికే అట్టే సమయం పట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా తమ సమస్యలు తొలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలి పశువులుగా మారామని, ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. ఆర్టీసీ కార్మికులు కోరినట్లుగా వైసీపీ ప్రభుత్వంలో విలీనం చేశారు. సీఎం జగన్ చిత్రపటాలకు అప్పట్లో విలీన అనంతరం ఆర్టీసీ కార్మికులు పాలాభిషేకాలు చేశారు. తమ కష్టాలు తీరుతాయని భావించారు. అయితే విలీనం పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తొలుత వారు భావించలేదు. విలీనం చేయడం వెనుక కంటికి కనిపించని వంచన ఉందని, ఉద్యోగులు ఆలస్యంగా తెలుసుకున్నారు. విలీనమైన తర్వాత ఒక్కొక్క ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. పీఆర్సీని కోల్పోవడమే కాకుండా పాత జీతం తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పీఆర్సీ 2017 సవరణ జరగ్గా, 2021లో పీఆర్సీ సవరణ జరగాలి. అయితే ఆర్టీసీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని, ఆర్టీసీలో జరగాల్సిన పీఆర్సీని వైసీపీ ప్రభుత్వం ఎగవేసింది. 2019 నాటి వేతనాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పేరుకే ఉద్యోగులు.. సెలవులు లేవు

ఆర్టీసీ ఉద్యోగులను పేరుకే ఉద్యోగులుగా చెబుతున్నా వారి విధుల్లో మాత్రం కార్మికులుగానే వైసీపీ ప్రభుత్వం చూసింది. సెలవులు ఇవ్వకుండా కంపెనీల చట్టం కింద సెలవులే వర్తిస్తాయని, సెలవులు ఎగ్గొట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు సమ్మె హక్కులు వర్తించవంటూ వారి హక్కులను కాలరాశారు.

పాత స్కీమ్‌లు రద్దు

టీడీపీ హయాంలో ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్‌స్కీమ్ అమలు జరిగేది. ఈ స్కీమ్ కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఉద్యోగులుగా ఉచితంగా వైద్యం లభించేది. రూ.30 లక్షల వరకు విలువైన వైద్యం కూడా పొందారు. నెలకు రూ.225 చెల్లించి వీహెచ్ఎస్ కార్డు తీసుకున్న ఫలితం లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. పెన్షన్ బెనిఫిట్స్‌ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఉద్యోగ విరమణ అనంతరం సైతం వారు ఒట్టి చేతులతోనే ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీలో ప్రభుత్వం విలీనం చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు రాకపోగా, కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోయామని, వి.హెచ్.ఎస్ హెల్త్‌కార్డు ఎందుకు పనికి రాలేదని, విలీనం వల్ల ఘోరంగా నష్టపోయామని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. పేస్కేల్ విషయంలోనూ, డీఏలను వైసీపీ ప్రభుత్వం ఎగవేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక తమ సమస్యలు తీరతాయని, పీఆర్సీ బకాయిలు చంద్రబాబు చెల్లిస్తారని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చతికిలపడ్డ పండుగప్ప

- కిలో రూ.500 నుంచి రూ.370కి పతనం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



పండుగప్ప చేపలు

మండవల్లి, జూలై 4 : చేపల సాగులో రారాజు పండుగప్ప కాస్తా చతికిలబడింది. గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటున్నారు. ఆక్వాలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపు విద్యుత్ చార్జీలు పెంపు, మరోవైపు మార్కెట్ స్థిరత్వం లేకుండా తగ్గదలతో ధర క్షీణించింది. వనామి రొయ్యల సాగులో వైట్ కట్ వైరస్ వంటి వ్యాధులు వ్యాపించి రైతాంగానికి తేరుకోలేని దెబ్బ తీయడంతో ఊహించని రీతిలో నష్టాలు బాటలో పడి అప్పుల పాలైపోయారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పంగస్, తెల్లచేప, రూప్‌చంద్ వంటి చేపల జాతుల పెంపకానికి శ్రీకారం చుట్టినా ఆశించిన లాభాలు రాకపోవడంతో పండుగప్ప వైపు మక్కువ చూపారు. పండుగప్ప సాగు 18 నెలలు నుంచి పైబడి సాగు చేయాల్సి ఉన్నా, అధిక ఖర్చు అవుతున్నప్పటికీ లాభాలు ఘనంగా ఉంటాయన్న ఆశతో వనామి రైతులు పండుగప్ప వైపు చూశారు. 18 నెలలు నుం చి పైబడి సాగు చేసిన రైతులు ప్రస్తుతం నెలకొన్న మార్కెట్ ధరను చూసి దిగాలు చెందుతున్నారు. పండుగప్ప పెంపకానికి తయారీ చేసే మేతతో పనిలేకుండా మేతగా బతికి ఉన్న చైనా గురక చేపలు వేయాలి. దీని కోసం రైతులు పడినకష్టం మాటల్లో చెప్పలేం. గతంలో చైనా గురక కిలో పది నుంచి 15 మాత్రమే ఉండేది. కొన్నిచోట్ల ఉచితంగా గురకను తీసుకుని పొమ్మని రైతులు కోరేవారు. పండుగప్ప పుణ్యమా అంటూ దాని ధర ప్రస్తుతం కిలో రూ.40 నుంచి రూ.50 పలకడంతో ఖర్చు భారీగా పెరిగింది. ఈ పందు గప్ప వ్యాధులు బారిన పడే ప్రమాదం లేకపోయినా ఆక్సిజన్ సమస్య కత్తిమీద సాములా ఉంటుంది. దీనికోసం విద్యుత్ మోటార్లు, ఇంజన్లు వంటివి ఏర్పాటు చేసి రేడియేటర్స్ ఆక్సిజన్ కోసం తిప్పాల్సి ఉంటుంది. ఆయిల్ ఖర్చు, విద్యుత్ బిల్లు భారీగా పెరిగాయని రైతులు వాపోతున్నారు. గత నెల 15న రూ.430 పలికిన పండుగప్ప ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.370లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దళారులు సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు కాని ధరను ప్రకటించి మాయ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పైబడి రూ.లక్ష పెట్టుబడి పెట్టి ప్రకృతి ఒడిదుడుకులు తట్టుకుని అమ్మకానికి వచ్చే సరికి ధర పడిపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు.

షీ టీములు ఎక్కడ?



- ఏలూరు నగరంలో పెరిగిన ఈవ్ టీజింగ్
- కళాశాలల వద్ద ఆకతాయిలు, అల్లరి గ్యాంగ్‌ల ఆగడాలు
- బిక్కుబిక్కుమంటూ కాలేజీలకు వెళ్తున్న విద్యార్థినులు

ఏలూరు క్రైం, జూలై 4 : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో రోజురోజుకూ ఈవ్‌టీజింగ్ జోరు పెరుగుతోంది. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పోలీసులు ఊపిరి పీల్చుకోవడానికి ఖాళీ లేకుండా విధులు నిర్వహించి శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించారు. ఇదే సమయంలో మిగిలిన కార్యకలాపాలపై దృష్టిని తగ్గించారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఇక బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే విధుల పట్ల వీరు అంతగా దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జూన్ మాసం కావడంతో విద్యా సంస్థలు తెరిచారు. ఈ క్రమంలో విద్యార్థినులను టార్గెట్ చేస్తూ ఆకతాయిలు, అల్లరి గ్యాంగ్‌లు సంబంధిత కాలేజీల వద్దకు మోటారు సైకిళ్లపై వచ్చి చక్కెర్లు కొడుతూ విన్యాసాలు చేస్తూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారు. కొత్తగా చేరిన విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ కాలేజీలకు వస్తున్నారు. ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులకు ఎక్కడ చెబితే కాలేజీలు మాన్పించేస్తారని భయపడుతూ తమలో తాము కుంగిపోతున్నారు. ఇంటర్మీడియట్ మహిళా కళాశాలలు, డిగ్రీ మహిళా కళాశాలల వద్దే ఆకతాయిల ఆగడాలు మరింత పెరిగాయి. కాలేజీ ప్రారంభమయ్యే సమయం, విడిచే సమయంలో ఆకతాయిలు చేరి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారు. ఆకతాయిల ఆటలు కట్టించేందుకు షీ టీమ్‌లు ఉన్నాయని గతంలో అధికారులు ప్రకటించినా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కాలేజీల వద్ద యూనిఫామ్‌లో, మఫ్టీలోనూ ఉండి ఆకతాయిలకు చెక్ పెట్టేవారు. ఆకతాయిలను స్టేషన్‌కు తీసుకువెళ్ళి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసేవారు. ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలు, అల్లరి గ్యాంగ్‌ల ఆగడాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

పనిచేసే ప్రదేశంలో మహిళలపై..

లైంగిక వేధింపులు నిరోధానికి కమిటీలు : కలెక్టర్

ఏలూరు క్రైం, జూలై 4 : పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం మహిళలపై లైంగిక వేధింపులు నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై మహిళా శిశు సంక్షేమశాఖ నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి 2013లో ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. చట్టం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు నలుగురు సభ్యులతో ఏర్పాటు చేయాలని, వారిలో కనీసం ఇద్దరు మహిళలను సభ్యులుగా నియమించాలన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా సంబంధిత కమిటీలు పనిచేయాలన్నారు. ఏఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆ చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్డీవో కె.ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి.. పాల్గొన్న అధికారులు



వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారుల సమీక్షలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

వేలేరుపాడు, జూలై 4 : వచ్చే నెలల్లో గోదావరికి వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులంతా అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. వరద సహాయ చర్యలపై గురువారం వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. '2022-23లో వచ్చిన వరదలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పటి ప్రభుత్వం బాధితులను గాలికి వదిలేసింది. ఈసారి మన ప్రభుత్వంలో ఎలాంటి అవకతవ కలకు చోటు లేకుండా బాధితులను ఆదుకునేలా క్షేత్రస్థాయిలో పనులు జరగాలి' అని ఎమ్మెల్యే కోరారు. ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ గ్రామాలు ఖాళీ చేసిన బాధితులకు తాత్కాలిక టెంట్లు వేసుకునేందుకు టార్పాలిన్ పట్టాలు ఇస్తామన్నారు. వరదలకు గ్రామాలను ఖాళీ చేయాల్సి వస్తే నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బాధితులను తరలిస్తామని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. మూడు లాంచీలు, 14 ఇంజన్ బోట్లను సిద్ధంగా ఉంచామని రెవెన్యూ అధికారులు చెప్పారు. మందులను, వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచామని అడిషనల్ డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తెలిపారు.

బంద్‌తో మూతపడిన విద్యా సంస్థలు



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుల ధర్నా

ఏలూరు అర్బన్, జూలై 4 : నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వల్ల విద్యార్థులకు వాటిల్లిన నష్టం, పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్య వేదిక(స్టూడెంట్ జేఏసీ) ఆధ్వర్యంలో గురువారం దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను స్వచ్ఛందంగానే మూసివేయగా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్దకు విద్యార్థి సంఘాల బృందాలు వెళ్లి మూసి వేయించాయి. ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ ప్రశ్నా పత్రం లీకేజీపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయలేని స్థితిలో ఉండడం దురదృష్టకరమన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ మాట్లాడారు.



కేంద్రమంత్రి అమిత్‌షాను కలిసిన సీఎం చంద్రబాబు, ఎంపీ పుట్టా తదితరులు

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రులను కలసిన సీఎం చంద్రబాబు, ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్, జూలై 4: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. గురువారం కేంద్రమంత్రులు అమిత్‌షా, పియూష్‌గోయల్, శివరాజ్‌సింగ్ చౌహాన్, 14వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ గోనగర్యాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ రాష్ట్ర సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర విభజన హామీల సమస్యలు పరిష్కరించాలని, అధిక నిధులు కేటాయించాలని, రాష్ట్రానికి జాతీయ రహదారులు, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, అనంతపురం నుంచి అమరావతి, హైదరాబాదు నుంచి అమరావతి వరకు రోడ్లు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గట్కరీనీ కోరారు. కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ తదితరులు ఉన్నారు.

12 నుంచి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

తణుకు, జూలై 4 : ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల్లోని చిట్టూరి సుబ్బారావు సత్య ఉషారాణి ఇండోర్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 14 వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల కార్యదర్శి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్యఉషారాణి, సెక్రటరీ మెంటే వంశీకృష్ణ తెలిపారు. అండర్-11,13,15,17,19 వయస్సు గల బాలబాలికలకు పురుషులు, మహిళలు, వెటరన్స్ 35,45,50,60,65,70ప్లస్ వయస్సుల కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంటిపూడి రాంబాబు చెప్పారు. పోటీలలో విజేతలైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను ఎస్.సతీష్, 99597 96929, సుదర్శన్ 97014 04675 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

940 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూలై 4 : రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి మొత్తం 940మంది విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిలైన ఎన్‌సీసీ, క్రీడా విభాగాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఎన్‌సీసీ విభాగంలో 590, క్రీడా విభాగంలో 350మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరయ్యారని అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు.



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఉమ్మడి పశ్చిమలో 13,410 ఇంజనీరింగ్ సీట్లు

ఏలూరు అర్బన్, జూలై 4 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో అడ్మిషన్ల సంఖ్యపై అఖిలభారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) స్పష్టతనిచ్చింది, ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. కొత్తగా పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్లను పెంచుతూ అనుమతులనిచ్చింది. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని 16 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో మొత్తం 13,410 సీట్లు ఈ ఏడాది ఆయా కోర్సుల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీచేస్తారు. ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు, సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న విషయం విదితమే.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరిక

పెదవేగి, జూలై 4 : నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా విక్రయదారులను హెచ్చరించారు. పెదవేగి మండలం వేగివాడలో గురువారం సాయంత్రం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ రికార్డుతోపాటు విక్రయించిన ఎరువులు, పురుగుమందులతో పాటు మిగిలిన నిల్వలను బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. ధరల పట్టికను విధిగా ప్రదర్శించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయించిన వాటికి రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందించాలన్నారు. తనిఖీల్లో ఏడీఏ వై.సుబ్బారావు, పెదవేగి ఏవో ఎం.ప్రియాంక పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న హబీబ్ బాషా

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల, జూలై 4: శ్రీవారి క్షేత్ర పాలకుడైన శివదేవుని ఆలయంలో గురువారం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి జరిగిన నంది వాహనంపై తిరువీధిసేవ భక్తులను అలరించింది. లోక కల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి నంది వాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.



చింత చిగురుతో ఆరోగ్యం

జోరుగా విక్రయాలు.. కిలో రూ.200-300

గ్రామీణ మహిళలకు జీవనోపాధి

గణపవరం, జూలై 4: చింతచెట్టు చిగురు చూడు.. చిన్నదాని పొగరు చూడు చింతచిగురు పుల్లగున్నదోయ్ చిన్నదేమో తియ్యగున్నదో అని ఒక సినీగేయ రచయిత రాసిన సినీగీతమే కాకుండా చింతచెట్టుపై అనేక సినిమా పాటలు రకరకాలుగా వచ్చాయి. చింతచిగురు వల్ల అనేక ఉపయోగాలు కవులు పాటలు రాశారు. జ్యేష్ఠ, ఆషాడమాసాల్లో లభించే చింతచిగురు దాని రుచి తెలిసిన వారికి చూస్తే చాలు వదలరు. ఎక్కడ ఉన్న మరీ తెచ్చుకుని ఆ రుచిని ఆస్వాదిస్తారనడంలో ఆతిశయోక్తిలేదు. ముఖ్యంగా పులుపు సంగతి ఎలా ఉన్న చింతచిగురు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేదనిపుణులు స్పష్టం చేస్తున్నారు. పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లో చింతచిగురుతో చేసిన వంటకాలు వడ్డించడం విశేషంగా చెబుతున్నారు. గ్రామీణ మహిళలకు చింతచిగురు ఒక ఉపాధిమార్గం. ఈ రెండు నెలల సీజన్‌లో పిల్లలు, మహిళలు చింతచెట్టు నుంచి చింతచిగురు సేకరించి ఇంటింటా తిరిగి, రహదారుల వెంబడి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వారపు సంతల్లో ఈ చింతచిగురు విక్రయాలు ఒక భాగమైంది. కిలో ధర రూ.200-300 వరకు విక్రయిస్తున్నారు.



చింతచిగురు విక్రయిస్తున్న మహిళ.. (ఇన్‌సెట్‌లో) చింతచిగురు

చింతచిగురుతో వంటకాలు

చింతచిగురు పప్పు, చింతచిగురు రొయ్యలు, చింతచిగురు చికెన్, చింతచిగుర మెత్తళ్ళు, చింతచిగురుకారం, చింతచిగురుపచ్చడి వంటి పలు రకాల వంటలు తయారు చేస్తుంటారు.

ఆరోగ్య ప్రయోజనాలు ఇలా..

చింతచిగురులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది తినడం వల్ల మలబద్ధక సమస్య తీరిపోతుంది. పైల్స్ నివారణకు ఔషధంగా పనిచేస్తుంది. యాంటీఆక్సిడెంట్‌లు అధికంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెంచుతుంది. గుండె జబ్బుల నివారణకు తోడ్పడుతుంది.

- శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలు అందిస్తుంది
- రక్తాన్ని శుద్ధి చేసే మంచి గుణాలు
- జీర్ణశయం సమస్యల నుంచి రక్షిస్తుంది.
- చింతచిగురు ఉడికించిన నీటితో పుక్కిలిస్తే గొంతునొప్పి, మంట, వాపు నివారిస్తాయి.
- నోటికి వచ్చే పూతలను, పగుళ్లను తగ్గిస్తుంది.
- విటమిన్-సీ అధికం.. రోగనిరోధక శక్తి వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది.
- చింతచిగురు అధికంగా వాడితే ఎముకలు ధృడంగా పెరుగుతాయి.
- ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపయోగపడుతుంది.
- శరీరంలోని వ్యర్థాలు బయటకు పంపే గుణాలు ఉన్నాయి.
- థైరాయిడ్ రోగులు చింతచిగురు ఆహారంలో ఉపయోగిస్తే మంచి ఫలితం
- డయాబెటిస్ ఉన్నవారు చింతచిగురు వినియోగిస్తే రక్తంలోని చక్కెరస్థాయిని తగ్గిస్తుంది.
- నేత్ర సంబంధ సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.
- నులిపురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింతచిగురు వంటకాలతో మంచి ఫలితాలు లభిస్తాయి.

నిర్వాసితులకు ఎన్నాళ్లీ బాధలు

ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులను పట్టించుకోరా ?

రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని మోసగించారు

రైతు సంఘం రాష్ట్ర నాయకులు

కుక్కునూరు, జూలై 4 : 'ప్రభుత్వాలు మారుతున్నాయి.. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలు మాత్రం తీరడం లేదు' అని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నిర్వాసితుల సమస్యలపై కుక్కునూరు మండలంలోని మద్రిపాడు, కివ్వాక పునరావాస కాలనీలను రాష్ట్ర రైతు సంఘం, కౌలు రైతు సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సందర్శించి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్వాసితులకు భూపరిహారం, పునరావాస పరిహారం అందించాలన్నారు. 2022 గోదావరి వరదలు సంబవించినప్పుడు ప్రభుత్వ అంచనా మొత్తం తప్పిందన్నారు. ప్రభుత్వాలు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడం లేదన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన యువతి, యువకులను పునరావాస జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం రూ.10లక్షలు పరిహారం ఇస్తామని చెప్పి కనీసం నిర్వాసితుల ముఖం చూడలేదన్నారు. గతంలో ఇచ్చిన భూములకు మూడున్నర లక్షలు రూపాయలు అదనంగా ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఈనెల పదో తేదీన కేంద్ర మంత్రులను ఢిల్లీలో కలిసి సమస్యలు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాణి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నరసింహారావు, నాగేంద్రరావు, సాయికిరణ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కివ్వాక నిర్వాసితులతో మాట్లాడుతున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

క్రైం కార్నర్

రూ.35 లక్షలు పోయినా.. కేసు లేదు ?

నేటికీ వీడని బ్యాగ్ చోరీ మిస్టరీ..

దొంగతనం చేసింది అంతర్ రాష్ట్ర ముఠానా.. స్థానికులా ?

గతంలో ఇలాంటి చోరీలు ఎన్నో..

ఇంకా కేసు పెట్టని వ్యాపారులు



నరసాపురం, జూలై 4: గతంలో నరసాపురం బులియన్ వ్యాపారికి చెందిన ఒక ఉద్యోగి నగదు పట్టుకుని వెళ్తుండగా భీమవరం బస్టాండ్‌లో బ్యాగ్ చోరీకి గురైంది. ఈ దొంగతనంలో చిక్కుముడి ఇప్పటికి సస్పెన్స్‌గానే మిగిలింది. ఐదేళ్ళ క్రితం నెల్లూరుకు చెందిన వ్యాపారి నరసాపురంలో ఆభరణాల ఆర్డర్, నగదు వసూలు చేసుకుని వెళ్తుండగా.. పెనుగొండ వద్ద సూట్‌కేస్ కొట్టేశారు. అప్పుడు కూడా భారీ మొత్తంలో నగదు, బంగారం పోయింది. విచారణలో మహారాష్ట్ర ముఠా అస్త్రం వెలుగుచూసింది. ఇలా భీమవరంలో కూడా బులియన్ వ్యాపారులకు సంబంధించి అనేక చోరీలు జరిగాయి. కొన్ని కేసుల్లో మిస్టరీ వీడితే.. మరికొన్నింటిల్లో ఇంకా ఆచూకీ కూడా చిక్కలేదు. తాజాగా మూడు రోజుల క్రితం నరసాపురం బస్టాండ్‌లో బ్యాగ్ చోరీలో కూడా ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్కా ప్లాన్‌గా ఈ చోరీ చేసి ఉండవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. గుంటూరు నుంచి ఉద్యోగిని వెంబడించి చోరీ చేశారా.. లేక నరసాపురం మార్కెట్‌లో ఎవరైనా వెంబడించారా అనేది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు ఈవిధంగా కనురెప్పపాటులో చోరీలు చేసే నైపుణ్యం అంతర్‌రాష్ట్ర ముఠాలకే ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ కేసులో ఇంతవరకు చిన్న క్లూ కూడా చిక్కలేదు. ఈ చోరీ పెద్ద మిస్టరీగా మారింది. మరోవైపు దీనిపై వ్యాపారులు ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. పోయింది లక్ష రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.35 లక్షలుపైనే. ఇంతపెద్ద మొత్తంలో సొమ్ము పోతే ఇంతవరకు ఎందుకు కేసు నమోదు చేయలేదన్న దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో బంగారానికి నరసాపురం మార్కెట్ పెట్టింది పేరు. దూరప్రాంతాల నుంచి అనేక మంది ఇక్కడికి బంగారం కొనేందుకు బస్సుల్లో వస్తుంటారు. గతంలో ప్రయాణికుల వద్ద ఇలా బంగారం కొట్టేసిన సంఘటనలు లేవు. ఒక్క వ్యాపారులకు సంబంధించిన గుమస్తాల సొమ్ము చోరీకి గురవుతుంది. ప్రస్తుతం జరిగిన దొంగతనాన్ని తేలిగ్గా తీసుకుంటే రానున్న రోజుల్లో మరిన్ని జరిగే అవకాశం ఉంది. ఈ కేసులో మిస్టరీని చేధిస్తే గాని దీనివెనుక ఉన్నది రాష్ట్ర దొంగలా.. అంతర్‌రాష్ట్ర ముఠా అనేది తేలనుంది. అయితే వ్యాపారులు కేసు పెడితేనే ఈ చోరీలో చిక్కుముడి వీడుతుంది. లేకపోతే ఇది పాత కేసులా మిస్టరీగానే మిగులుతుందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

ఆగిన బస్సును ఢీకొని వంటమేస్త్రి దుర్మరణం

పెదపాడు, జూలై 4: పెదపాడు మండలం కలపర్రు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదపాడు మండలం పాతముప్పర్రుకు చెందిన బుల్లంకి ఉమామహేశ్వరరావు (25) కలపర్రు హైవేపై వున్న హోటల్‌లో వంటమేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విధులు ముగించుకుని బుల్లెట్‌పై వెళ్తూ కలపర్రు సాయిబాబా గుడి సమీపంలో బీహెచ్‌ఎల్ నుంచి ఏలూరు వెళుతున్న ఆగి వున్న బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన అతడు మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి తులసీదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్‌ఐ కె.శుభశేఖర్ తెలిపారు.



ప్రమాద స్థలం వద్ద బస్సు, బైక్.. (ఇన్‌సెట్‌లో) మృతదేహం

దుక్కుదున్నుతూ ట్రాక్టర్ నుంచి పడి ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, జూలై 4 : పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడి మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో జరిగింది. గురువారం తాడువా యి గ్రామంలో పొలంలో కలపాల రాంబాబు (33) ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారి ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు రాంబాబుకు తాడువాయి శివారులో రెండెకరాల వ్యవసాయభూమి ఉందని, కొద్ది రోజుల కిందట ట్రాక్టర్ కొనుగోలు చేసినట్టు బంధువులు తెలిపారు. అతడు గ్రామంలో అందరినీ మంచిగా పలకరిస్తాడని చిన్నవయసులోనే మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జ్యోతిబసు తెలిపారు.



రాంబాబు (ఫైల్)

గునపంతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొయ్యలగూడెం, జూలై 4: పాత గొడవల కారణంగా ఓ వ్యక్తిపై మరొకరు గునపంతో దాడి చేసిన ఘటన కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో జరిగింది. ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాలివి.. గురువారం పాత గొడవల కారణంగా వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన తాడేపల్లి సాయి అనే వ్యక్తి గుణపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలకు గాయమైంది. గతంలో వీరిద్దరికి వివాదం జరగడంతో కేసు నమోదు చేశామని మళ్లీ ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఇద్దరికి పక్కపక్కనే పొగాకు బ్యారన్‌లు ఉండడం, ఒకే దారి ఉండడం వల్ల గొడవలు జరుగుతున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారి హుండీ నుంచి నగదు తస్కరణ

పట్టుకుని పోలీసులకు అప్పగించిన దేవస్థానం సెక్యూరిటీ

ద్వారకాతిరుమల, జూలై 4: చినవెంకన్న ఆలయ ప్రాంగణంలోని ఓ హుండీలో చేయిపెట్టి నగదును తస్కరించిన వ్యక్తిని ఆలయ మహిళా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం అతడి నుంచి నగదును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ జి.సతీష్ తెలిపిన వివరాలివి.. చింతలపూడిలోని ఆంథోనినగర్‌కు చెందిన దుడ్డి పవన్‌కుమార్ గురువారం ఉదయం క్షేత్రానికి వచ్చి 11.30 గంటల సమయంలో అనివేటి మండపం వద్దనున్న హుండీలో చేయిపెట్టాడు. దీన్ని చూసిన దేవాలయ సెక్యూరిటీ సిబ్బంది అల్లాడ ధర్మావతి అతడిని పట్టుకుని, అతడి వద్ద వున్న రూ.500 నగదును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు, ఇప్పటికే అతడిపై పది కేసులు వరకు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సెక్యూరిటీ ధర్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొయ్యలగూడెం, జూలై 4: మోటార్ సైకిల్‌ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బయ్యన్నగూడెం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గురువారం సాయంత్రం కొయ్యలగూడెం నుంచి అశ్వారావుపేటకు మామ్మ, మనుమడు వెళ్తున్న మోటారుసైకిల్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తల, కాలు, చెయ్యికి తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. బైక్‌పై ఉన్న వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



తీవ్ర గాయాలైన మనుమడు, మామ్మ

గేదె అడ్డొచ్చి.. మోటారు సైక్లిస్టుకు గాయాలు

కైకలూరు, జూలై 4: రహదారి ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఎస్‌ఐ సమయస్ఫూర్తితో ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలను అందించారు. గురువారం మండవల్లికి చెందిన తెంటు హేమంత్ అనే యువకుడు కైకలూరు మండలం ఆటపాకలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఆ సమయంలో గేదె అడ్డురావడంతో ఢీకొనగా గాయాలయ్యాయి. ఆ సమయంలో ఆటుగా వెళుతున్న కైకలూరు రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ యువకుడిని తన జీపులో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.

ఖత్తర్‌లో గుమ్ములూరు వాసి మృతి

అగ్నిప్రమాదంలో కుమారుడుకి గాయాలు

పోడూరు, జూలై 4 : ఖత్తర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తండ్రి మృతిచెందగా కుమారుడు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలివి.. పోడూరు మండలం గుమ్ములూరు గ్రామంలో కోమటి చెర్వు ప్రాంతానికి చెందిన షేక్ బాషా(46), ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం ఖత్తర్ వెళ్లి టైల్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏడాది కిందట స్వదేశానికి వచ్చి తిరిగి ఖత్తర్ వెళ్తూ తన కుమారుడు షేక్ వల్లీని అక్కడ డ్రైవింగ్ పని నిమిత్తం కూడా తీసుకుని వెళ్లాడు. వారిద్దరూ కలిసి ఒక రూమ్‌లో ఉంటున్నారు. రోజూ తండ్రి టైల్స్ కంపెనీలో పనిచేస్తూ, కుమారుడు డ్రైవింగ్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. బుధవారం సాయంత్రం వీరు ఉండే ఇంటిగదిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి బాషా పూర్తిగా కాలిపోయి మృతి చెందాడు. కుమారుడు వల్లీ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ప్రమాద ఘటనపై బుధవారం రాత్రి ఇక్కడ కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. ప్రమాదం ఏవిధంగా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాషా మృతిచెందడంతో ఆధారం కోల్పోయిన వారి కుటుంబం కన్నీరుమున్నీరైంది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మీరాబీబీ, కుమారుడు వల్లీ, కుమార్తె తనూజ బేగం ఉన్నారు. వల్లీ ఖత్తర్‌లో ఉంటుండగా కుమార్తె తనూజ బేగంకు వివాహం జరిగి అత్తవారి ఇంటివద్ద ఉంటుంది.



షేక్ బాషా (ఫైల్)



అమృతహస్తం, రాజుగారి గోచీ నాటికల్లో సన్నివేశాలు

'ప్రజల హృదయాల్లో నాటికలకు సుస్థిరస్థానం'

అలరించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 4 : ప్రజల హృదయాల్లో నాటికలు సుస్థిర స్థానం అని హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. వైఎంహెచ్ఏ హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 7వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. నాటకం కలకలం ఉంటుందని, ఎంతో మంది కళాకారులు నాటకంతో ప్రజల హృదయాల్లో కలకాలం గుర్తుంటాయన్నారు.

'అమృతహస్తం' నాటిక..

అమరావతి ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'అమృతహస్తం' ఆలోచింపచేసింది. ఒక తల్లికడుపున పుట్టిన అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనురాగం, ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న తరుణంలో ఆ బంధాల గొప్పతనం నేటి సమాజానికి అవి ఎంతో అవసరమని తెలిపేలా నాటిక చాటిచెప్పింది. ప్రేమపెళ్లి చేసుకుని, భర్త దాష్టీకానికి గురవుతున్న పిల్లలను భర్తతో సహా ఆదరించిన అన్న ఆడపడుచు భర్త దురాశను ఆధునిక టెక్నాలజీతో చట్టం ముందు నిలబెట్టిన అతని భార్య తెలివితేటలు ఇలా ప్రతి సన్నివేశం ప్రేక్షకుల మనస్సులను దోచుకుంది. రచన కె.సత్యనారాయణ, దర్శకత్వం వై.హరిబాబు వహించారు.

'రాజుగారి గోచీ' నాటిక..

కళానికేతన్, వీరన్నపాలెం బృందం వారిచే 'రాజుగారి గోచీ' నాటిక ఆకట్టుకుంది. రాజుని, పాలనను ఎలాగైనా దారిలో పెట్టాలని చూసే మాజీ మంత్రి నేర విచారణ, నేరస్థుడి శిక్షణ కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితులను ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే 'రాజుగారి గోచీ' నాటిక ప్రేక్షకులను అలరించింది. ఓ చిన్న దీవిలో ఆరువేల జనాభా. ముక్కుపిండి పన్నులు వసూలుచేసే పాలకులు, పేదల శ్రమను దోచుకునేందుకు జూదశాలలను ఏర్పాటు చేస్తారు. దానివల్ల ఓ హత్య జరుగుతుంది. హంతకుడికి రాజు ఉరిశిక్ష వేస్తాడు. ఉరిశిక్ష అమలు చేయలేక దాన్ని జైలుశిక్షగా మారుస్తాడు. ఖైదీకి భోజనం, కాపలా, ఆర్థిక వ్యవస్థకు భారమవుతుంది. కూర్చొని తినడానికి అలవాటు పడ్డ హంతకుడు వెళ్ళిపొమ్మనా వెళ్ళడు. చివరకు ఖైదీ కోర్కెలు తీర్చి బుజ్జగించి దేశం దాటించి వేస్తారు. చివరిగా నేరవిచారణ, నేరస్థుడికి శిక్ష కంటే బాధితులను ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే 'రాజుగారి గోచీ' నాటిక విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, కేటీవీ రమేష్, గౌరవ అధ్యక్షుడు గుత్తా కౌసల్యాంద్రరావు, ఎస్‌కే ఖాజావలీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు ముంపున ఉన్నాయా ?

పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పాలకొల్లు రూరల్, జూలై 4 : మండలంలో ముంపునకు గురైన నారుమడులు ఏమైనా ఉన్నాయా ? అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం లంకలకోడేరు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయనఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో వచ్చే వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులకు అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. నారుమడులు ఏదశలో ఉన్నాయి. నాట్లు ఎప్పటికి పూర్తి అవుతాయని అధికారులను అడిగి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. పీఎం కిసాన్ పథకంపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ అడ్డాల పార్వతి, ఏవో ఎం.శామ్యూల్ జాన్సన్, జిల్లా సాంకేతిక వ్యవసాయ శాఖ అధికారి బీఆర్ ప్రియదర్శిని, ఏఈవో కె.ప్రవీణ్, వీఏఏ డి. నరేంద్రకుమార్, భరత్ తదితరులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మోకాళ్లతో శ్రీవారి మెట్లెక్కిన పవన్ వీరాభిమాని

ద్వారకాతిరుమల, జూలై 4: చేతిపై పవన్‌కల్యాణ్ పచ్చబొట్టు.. పవన్ గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టేలా చూడు స్వామీ.. అంటూ చిన వెంకన్నకు ఓ పవన్ వీరాభిమాని మొక్కుకున్నాడు. ఇటీవల కూటమి గెలుపుతో ఆ యువకుడు గురువారం చిన వెంకన్న ఆలయ ప్రధాన రాజగోపురం మెట్ల మార్గాన మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కును తీర్చుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలికి చెందిన సూర్య దుర్గానరసింహారావు ఉదయం శ్రీవారి ఆలయానికి చేరుకుని మొక్కు అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సూర్య మాట్లాడుతూ తాము ఆశించిన దానికంటే పవన్‌కు ఆ భగవంతుడు ఎక్కువే ఇచ్చారని.. కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండేలా పాలన ఉంటుందని చెప్పారు.



ఆలయ మెట్లను మోకాళ్లతో ఎక్కుతున్న పవన్ అభిమాని సూర్య

డీటీసీ డీఎస్పీ బదిలీ ఉత్తర్వులు జారీ

ఏలూరు క్రైం, జూలై 4 : ఏలూరు జిల్లా పెదవేగిలో ఉన్న డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న కింజారపు ప్రభాకరరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్టణం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఆయనను బదిలీ చేశారు. కొన్నేళ్ళుగా పెదవేగి డీటీసీ డీఎస్పీగా ఆయన విధులను నిర్వర్తిస్తున్నారు. వచ్చే నెలలో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు.



ప్రభాకరరావు

పోలీసులకు చిక్కిన సైబర్ నేరస్థుడు

ముసునూరు, జూలై 4: సైబర్ నేరాల్లో ఆరితేరిన యువకుడిని గురువారం ముసునూరు పోలీసులు పట్టుకుని, సైబర్ పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాలివి.. ఈనెల రెండున రమణక్కపేటలో పేకాట శిబిరంపై దాడి చేయగా చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన పొన్నగంటి తేజ్‌కుమార్ పట్టుపడగా కేసు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న వరంగల్ సైబర్ పోలీసులు తేజ్‌కుమార్ చేసిన సైబర్ నేరాలు, అతడిపై నమోదైన కేసుల సమాచారం అందించారని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని చాట్రాయిలో అదుపులోకి తీసుకుని సైబర్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పి.తేజ్‌కుమార్

చెరువు మరమ్మతులకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే ధర్మరాజు


చెరువు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉంగుటూరు, జూలై 4: మండలంలో చెరువుల మరమ్మతులకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని గొల్లగూడెం చెర్వు గట్ల పటిష్టత పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. గట్ల పటిష్టతతో వర్షాకాలం ముంపు సమస్య ఉండదన్నారు. సర్పంచ్ కరపా శ్రీనివాసరావు, పంది రాంబాబు. పాతూరి విజయకుమార్, వేములపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు: స్థానిక మంచినీటి చెరువుకు ప్రక్షాళనకు యువకులు సొంత ఖర్చుతో బాగు చేశారు. నిడమర్రు సమగ్ర మంచినీటి చెరువులో చెత్త, తూడు పేరుకుపోయి తాగు నీటి ఇబ్బందిగా ఏర్పడింది. ఎమ్మెల్యే ధర్మరాజు అనుమతితో జనసేన యువత రూ.4 లక్షల అంచనాతో పనులకు శ్రీకారం చుట్టారు. మూడు రోజులుగా సాగుతున్న పనులు ఎమ్మెల్యే ధర్మరాజు గురువారం పరిశీలించారు. చెల్లంశెట్టి రమష్, కన్నాజి చిన్ని, బొచ్చు గణేస్, పడాల వీరాస్వామి, మీసాల హరిబాబు, అంబళ్ల విజయభాస్కర్ , సత్తినీడి నాని తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు, జూలై 4: మేడేపల్లిలో తాగునీటి ఇబ్బందలను స్థానికులు గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు వివరించినా స్పందించడం లేదని ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమస్యను వివరించారు. సాయంత్రానికల్లా సమస్య పరిష్కారం కావాలని ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే వరద సమీక్షా సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యే లోపే అధికారులు పెదవాగులో కొత్త విద్యుత్ మోటార్ ఏర్పాటుచేసి గ్రామస్థులకు తాగునీరు అందించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో డయేరియా నివారణ కార్యక్రమాలు : డీపీవో


అంతర్వేదిగూడెం ర్యాలీలో డీపీవో

బుట్టాయగూడెం, జూలై 4: జిల్లా వ్యాప్తంగా 62 రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. అంతర్వేదిగూడెంలో గురువారం స్టాప్ డయేరియా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి పైపులైన్లను పరిశీలించిన ఆయన పైపు లైన్ల ద్వారా క్లోరిన్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. మంచినీటి వనరులు క్లోరిన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రపరచడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణకు ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఫాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఏజెన్సీలో జరుగుతున్న స్టాప్ క్యాంపైన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.అంజలీదేవి, జి.ప్రవీణ్‌కుమార్, ఎం.సుమంత్‌వర్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: గ్రామాల్లో ఇంటింటా వైద్యసిబ్బంది సర్వే నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కె.గోకవరం పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ కృష్ణకిషోర్ తెలిపారు. కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అబ్రార్ హుస్సేన్, ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● భీమడోలు: పోలసానపల్లిలో పారిశుధ్య కార్యక్రమాల పనులను ఈవోపీఆర్డీ, వైద్య సిబ్బంది పరిశీలించారు. అరుంధతి కాలనీ, పోలసానపల్లి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

కుక్కునూరు, జూలై 4: ప్రస్తుతం గోదావరి వరదలు సమయం కావడంతో అధికారులంతా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అచ్యుత కుమారి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో గురువారం వరదలపై సమీక్ష నిర్వహించారు. ప్రతీ అధికారి, కిందిస్థాయి సిబ్బంది సెలవులకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బియ్యం, నిత్యవసరాల నిల్వలు, వరదల సమయంలో మంచినీటి కొరత లేకుండా తీసుకోవల్సిన చర్యలపై సమీక్షించారు. విద్యుత్ సరఫరా, రహదారుల దిగ్బంధం అయితే తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు.

దొడ్డి కొమరయ్యకు నివాళి

బుట్టాయగూడెం, జూలై 4: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమరయ్య వర్థంతి సందర్భంగా గురువారం దొరమామిడిలో నివాళులర్పించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ పార్టీ జెండా ఎగురవేసి నివాళులర్పించారు. నిజాం సైనికులకాల్పుల్లో కొమరయ్య మరణించారని తెలిపారు. దేశభక్తి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, పటాన్ సిలార్ ఖాన్, కొమరం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి కూటమి శ్రేణుల పూజలు

పెదపాడు, జూలై 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపుతో అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామికి పూజలు చేశారు. గురువారం కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో, ముఖ్యమంత్రి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్డి వాసవి, బోయపాటి దీప్తి, పావులూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

7న స్టెనోగ్రాఫర్స్ జిల్లా యూనిట్ ఎన్నికలు

ఏలూరు రూరల్, జూలై 4: ఏపీ రాష్ట్ర టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూనిట్ ఎన్నికలు ఈనెల 7న ఏలూరులో జరగనున్నాయి. టైపిస్ట్‌లు, స్టెనోగ్రాఫర్ల సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సురేష్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వశాఖల టైపిస్ట్‌లు, స్టెనోగ్రాఫర్లు హాజరై సంఘ బలోపేతానికి తోడ్పడాలని ఆయన కోరారు.


ఐటీడీఏలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన పీవో సూర్యతేజ, అధికారులు, ఏలూరులో ఎన్జీవో నేతలు, ఉద్యోగుల నివాళి, పంగిడిగూడెం పాఠశాలలో విద్యార్థుల నివాళి, కైకరంలో విద్యార్థుల ప్రదర్శన

విప్లవ జ్యోతి
అల్లూరి సీతారామరాజు
జయంతి కార్యక్రమాల్లో ఘన నివాళి

ఏలూరు అర్బన్: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు నేటి తరానికి స్ఫూర్తి అని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో అల్లూరి సీతారామరాజు జయంత్రి కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పీడీఎస్‌వో-ఎస్‌వైఎస్ ఆధ్వర్యంలో జూట్‌మిల్లు సెంటర్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పించారు. మోహన్, ఎస్‌కె.బాషా, ప్రశాంత్, రాజా, గణపతి, శ్రీను, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. నగరానికి చెందిన కాకర్ల రాజేంద్రప్రసాద్ తన మరణానంతరం శరీర దానం చేస్తూ పత్రాలను ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్లు చింతా దుర్గాప్రసాద్, శైలజకు అందచేశారు. ఎస్‌ఎన్.రమేష్, కిరణ్‌కుమార్, లీలామోహన్ రావు, ప్రసాదరావు, కృష్ణారావు, సుందరయ్య, పుష్పరాజ్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. కేఆర్.పురం ఐటీడీఏ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పీవో ఎం.సూర్యతేజ పూలమాలవేసి నివాళులర్పించారు. నూతిరామన్నపాలెంలో తెల్లం బాలరాజు, చీమలవారిగూడెంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలోజు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన గెరిల్లా పోరాటం మరువలేదన్నారు. ఆదివాసీ గిరిజనులను అభివృద్ధి, పోడు భూములు, భూముల హక్కుల కోసం పోరాటం చేశారని తెలిపారు. బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచిన మన్యం వీరుడు అల్లూరి అని కొనియాడారు. జి.మోహనరావు, పొడియం లక్ష్మీ, కుంజా వెంకటేశ్వరావు, తెల్లం చిన్నారావు, పొడియం లక్ష్మణరావు, చంద్రు బుల్లెమ్మ, వెంకటస్వామి, వీరాయమ్మ, సంకురుడు, దుర్గమ్మ, అధికారులు ఏపీవో వీవీఎస్.నాయుడు, మేనేజర్ మంగర ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి సాహసం ప్రతి ఒక్కరు పుణికి పుచ్చుకోవాలని పలువురు వక్తలు కోరారు. కైకరం హైస్కూలు, నారాయణపురం జూనియర్ కళాశాల, ఉప్పాకపాడు ఫౌండేషన్ స్కూలులో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. కైకరం హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ.శ్రీనివాస్, అధ్యాపకులు, ఉప్పాకపాడు హెచ్‌ఎం నక్కా సుధాకర్ పాల్గొన్నారు.

● పెదపాడు: బ్రిటీష్ సామ్రాజ్యంతో అలుపెరగని పోరాటం చేసి తుది శ్వాస విడిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నిడమర్రు: తెలుగువారి స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం అసువులు బాసిన అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఫత్తేపురంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మానవత రీజనల్ ఛైర్మన్ సాగిరాజు జానకిరామారాజు, రుద్రరాజు కొండరాజు, యుగంధర్‌రాజు, పొత్తూరి నరసింహరాజు, చింతలపాటి బాసిరాజు, పొత్తూరి వాసురాజు, వంగా రఘు, నిమ్మల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు, అధ్యాపకులు వి.శ్రీనివాస్, కె.ఇందిరాకుమారి, ఎం.ఉషారాణి, ఎం.రామ్మోహన్, దారావతు మల్లేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. శాఖ గ్రంథాలయం వద్ద సీపీఐ నేత టీవీఎస్.రాజు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఎం.భీమరాజు, పాఠశాల బీడీసీ ఎల్.సుకన్య, సువర్ణ జోషి, సోమంత్, రమణమ్మ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: స్థానిక అల్లూరి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, వైసీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, వివిధ స్వచ్ఛంద సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.నరేంద్ర కుమార్, ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో రావూరి కృష్ణ, దాసరి శ్యామ్ చంద్రశేషు, పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, మారిశెట్టి బాలచిట్టెమ్మ, గొల్లమందల శ్రీనివాసరావు, కొంచాడ ప్రసాద్, అర్జుల మురళి, బ్రహ్మాజీ, పి.రంగరాజు, నంబూరి రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏరియా ఆసుపత్రి ఆవరణలో విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు నివాళులర్పించారు. డాక్టర్లు, సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: విద్యుత్ భవన్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఏవో కె.సత్యకిషోర్, ఈఈలు ఎస్.ఎన్ అప్పారావు, డి.శశిధర్, కె.గౌరీ తదితరులు పాల్గొన్నారు. ఏలూరు కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం జి.సునీత అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, అజయ్ బాబు, బొంతిన రామకృష్ణ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్ఆర్ స్టేడియంలో మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి కార్యక్రమాల్లో కర్రి అరుణ, మేరీమాణిక్యం తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు ఆయన చిత్రపటానికి ఎంపీడీవో ప్రణవి నివాళులర్పించారు. ఏవో సుజాత, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: పంగిడిగూడెం జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం మస్తాన్‌బీబీ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మద్దాల పెద్దిరాజు, కుమారస్వామి, మల్లయ్య, ప్రభాకరరావు, రమేష్, శారద, సీతామహలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ మేరీ ప్రశాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ పాలకులను ఎదిరించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. డీటీసీ డీఎస్పీ కింజారపు ప్రభాకరరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.


ఏలూరులో అల్లూరి సీతారామరాజు వేషధారణలో విద్యార్థులు, జంగారెడ్డిగూడెంలో అల్లూరి విగ్రహం వద్ద నేతల నివాళి, కొయ్యలగూడెంలో సీపీఐ నేతల నివాళి, జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరులో విద్యార్థులను పంపించేస్తున్న విద్యార్థి సంఘ నేతలు, బుట్టాయగూడెంలో పీడీఎస్‌యూ ర్యాలీ, జంగారెడ్డిగూడెంలో బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు

నీట్ రద్దు కోరుతూ విద్యా సంస్థల బంద్

బుట్టాయగూడెం, జులై 4: నీట్ యూజీ పరీక్ష రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ పిలుపులో భాగంగా మండలంలో విద్యా సంస్థల బంద్ గురువారం విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలు మూతపడ్డాయి. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల నాయకుడు ఎం.సిద్ధూ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ పరీక్షలను సక్రమంగా నిర్వహించకపోవడం వలన లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ ఫలితాలు విచిత్రంగా ఉన్నాయని తక్షణమే నీట్ పరీక్షను రద్దుచేసి మరలా నిర్వహించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వి.మహేష్, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: నీట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. పలు పాఠశాలలు పనిచేస్తుండడంతో విద్యార్థి సంఘ నాయకులు వెళ్లి హెచ్‌ఎంలతో మాట్లాడి బంద్‌కు సహకరించాలని కోరారు. నీట్ పరీక్షలు రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బి.జగన్, బి.వినోద్, ప్రణీత్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి నుంచి ఆర్టీసీ సర్వీసులు పెంచాలి

చింతలపూడి, జూలై 4: నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడి నుంచి ఆర్టీసీ సర్వీసులు పెంచాలని, గతంలో రద్దుచేసిన సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి టి.నాగవిజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో విజయవాడకు బస్సుసర్వీసు నడపాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కాకముందే చాలా ఆర్టీసీ సర్వీసులు ఉండేవని, వాటిని రద్దుచేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూరప్రాంత సర్వీసులు నడపాలని, మెరుగైన బస్సులతో గ్రామీణప్రాంత సర్వీసులు నడపాలన్నారు. గ్రామాల్లో బస్సులు నడిపితే మహిళలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చామని చెప్పారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

లింగపాలెం / చింతలపూడి, జూలై 4: నామినేటెడ్ పదవుల్లో బీసీ యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో పలువురు బీసీ యాదవ నాయకులు గురువారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 45వేలకు పైగా యాదవులు ఉన్నారని, 80శాతంకు పైగా తెలుగుదేశంపార్టీ వెంటే ఉన్నారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో గుర్తింపు ఇవ్వాలన్నారు. ఏఎంసీ ఛైర్మన్ పదవితో పాటు పలు నామినేటెడ్ పదవులను తమ సామాజిక వర్గానికి ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు చెన్ను శ్రీనివాస్ యాదవ్, సాయిల సత్యనారాయణ, సంకుల రాటాల రాజు, పొన్నుబోయిన సురేష్, చింతా నాగు, తదితరులు ఉన్నారు.

నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జీలుగుమిల్లి, జూలై 4: అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. మండల సర్వ సభ్య సమావేశంలో గురువారం ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దర్భగూడెం జలజీవన్ మిషన్‌కు రూ.55 లక్షలు మంజూరు కాగా రెవెన్యు అధికారులు స్థలం చూపడం లేదని ఎంపీటీసీ సున్నం సురేష్ అన్నారు. తాటియాకులగూడెంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రూ.10 లక్షల దుర్వినియోగంపై రికవరీ పెట్టాలని ఏపీవోను ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లెళ్లగూడెం, చిర్రివారిగూడెం, పలు గ్రామాల్లో పాడైన మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి పనులు వేగవంతం చెయ్యాలన్నారు. జీలుగుమిల్లి నుంచి పి.రాజవరం వెళ్లే రహదారికి నిధులు మంజూరయ్యాయని, పలు గ్రామాల్లో శ్మశాన వాటిక రహదారులు, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ కోర్స పోశమ్మ, జడ్పీటీసీ మల్లం వసంత్, ఎంపీడీవో కేఎం.మంగతాయారు, తహసీల్దారు ఆర్‌వి.వెంకటేశ్వరావు, ఎంఈవో కె.శ్రీనివాస్, ఏవో కె.గంగాధరం, పలు శాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్థంతి సందర్భంగా సత్రంపాడులో షేక్ సుభానీ నివాళులర్పించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్జున్ తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు 1వ పట్టణంలో వెంకన్న ట్యాంకు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్‌లలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆశాఖ ఈఈ నటరాజన్ తెలిపారు.
- **ఏలూరు అర్బన్ :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఏపీపీఎస్‌సీ నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్టుల షెడ్యూలు విడుదలైందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 2 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.
- అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని వాల్ ఆఫ్ కైండ్‌నెస్ సొసైటీ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కేపీడీటీ హైస్కూలులో టెన్త్ టాపర్ కలగంటి శోభనకు నగదు బహుమతి, జ్ఞాపికలను సంస్థ నాయకులు అందజేశారు.
- **పెదపాడు :** మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏవో వి.ప్రదీప్‌కుమార్ తనిఖీ చేశారు. అప్పనవీడు ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ రిజిస్టార్‌లు, బిల్‌బుక్‌లు, సరుకు నిల్వ తదితర అంశాలను పరిశీలించారు. డీసీఎంఎస్ సెక్రటరీ భాస్కరరావు, వీఏఏలు నాగరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- **దెందులూరు :** గోపన్నపాలెం ప్రభుత్వ హైస్కూల్‌లో త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ కొరకు ఎన్ఆర్ఐ గోపి శ్రీరామూర్తి కుమారుడు గోపి మురళి రూ. 15 వేలు ఇచ్చారు. చెక్‌ను చింతా సుబ్బారావు, కొండేటి హనుమంతు హైస్కూల్ హెచ్‌ఎం మరీదు మనోహర్‌కు అందజేశారు.
- **భీమడోలు :** భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు సందర్శించారు. ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీ చేసి వైద్య కేంద్రానికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అతిసార వ్యాధికి వైద్య సేవలు అందుకుంటున్న రోగులను ఆయన సందర్శించారు.
- **చింతలపూడి :** టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆరోగ్యంగా తిరిగి రావాలంటూ పలు గ్రామాల్లో, ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. రేచర్ల శివాలయం, ఎర్రంపల్లి రామాలయంలో గ్రామస్తులు పూజలు చేశారు.
- **ద్వారకా తిరుమల :** జి.కొత్తపల్లి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం డిపో నుంచి బస్సును గురువారం ప్రారంభించారు. జి.కొత్తపల్లి జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు సమీప గ్రామాల విద్యార్థుల ఇబ్బందులను హెచ్‌ఎం కె.లీలాకుమార్ స్థానిక టీడీపీ నేత రేగంటి రాంబాబు, ఇతరుల దృష్టికి తీసుకెళ్లారు. జంగారెడ్డిగూడెం డీఎం పీవీ గంగాధరరావుతో మాట్లాడి బడిబస్సును ఏర్పాటు చేయించారు.
- ద్వారకాతిరుమల పసరుకోనేరు ప్రాంతంలో పంచాయతీ షాపులకు జరిగిన వేలంపాటల ద్వారా రూ.4.50 లక్షలు అధిక ఆదాయం లభించింది. 2025 మార్చి నెలాఖరు వరకు దాదాపు ఎనిమిది నెలల కాలానికి గాను షాపుల ద్వారా రూ.4.50 లక్షలు ఆదాయం రానుండగా గతేడాది రూ.2.80 లక్షలు మాత్రమే వచ్చినట్టు అధికారులు తెలిపారు.
- **ఏలూరు క్రైం :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ అన్నారు. అమీనాపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల నుంచి వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, వంట శాల, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వార్డెన్, విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.


భీమడోలులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గన్ని వీరాంజనేయులు, గాలాయగూడెంలో దుస్తుల పంపిణీ, జీలుగుమిల్లిలో రంగా విగ్రహం వద్ద యువకుల నివాళి, దిప్పకాయలపాడులో మాట్లాడుతున్న కరాటం రాంబాబు


ఏలూరులో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

వంగవీటి మోహన రంగా
పేదల ఆశాజ్యోతి
జయంతి కార్యక్రమాల్లో పలువురి నివాళి

ఏలూరు టూటౌన్, జూలై 4: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగ అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. భవన నిర్మాణ కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో రంగా జయంతి గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పేద, బలహీన వర్గాలకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ అధ్యక్షులు తోట నాగు, పూజారి కొండ, దుగ్గిరాల రాజు, కార్యదర్శి ముత్యాలరావు, ఆర్నేపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. సీఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల వద్ద జరిగిన వంగవీటి మోహన రంగ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి పాల్గొన్నారు. వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా అభిమానులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వంగవీటి మోహన రంగ విగ్రహానికి పూలమాలలు వేసి చంటి నివాళులర్పించారు. కన్నయ్యపార్కు వద్ద వంగవీటి మోహన రంగా విగ్రహానికి కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్. పెదబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్.శ్రీదేవి, రాజేష్, సీతా రామయ్య, ప్రభాకరరావు, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: కాపునాడు జిల్లా అధ్యక్షుడు జల్లా హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డిఅప్పలనాయుడు తదితరులు మాట్లాడారు. రంగా ఆశయాల సాధన కోసం కృషిచేస్తామన్నారు. కమ్ముల కృష్ణ, కుప్పాల శ్రీనివాస్, బి.నరసింహరావు, కె.శ్రీనివాసరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: వంగవీటి మోహన్‌రంగా నేటికి ప్రజల మనస్సులో ఉన్నారని కొఠారు ఆదిశేషు అన్నారు. గాలాయగూడెంలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కొఠారు శ్రీలక్ష్మి, ఏనుగు రామకృష్ణ, పూజారి శ్రీనివాసరావు, పూజారి వెంకటరత్నం నాయుడు, పెద్దిశెట్టి నాని, మండూరి బుజ్జి గోపాల్, సీతారాం, అశోక్, పాటు పలువురు నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. వంద మంది వృద్ధులకు చీరలను కూటమి నాయకులు పంపిణీ చేశారు.

● కుక్కునూరు: కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గోపరాజు, నాగేశ్వరరావు, ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, సొంగ కొండయ్య, మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కాపు సామాజికవర్గంతో పాటు శ్రమ జీవుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగా అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కైకరంలో రంగా విగ్రహానికి జనసేన, తెలుగుదేశం శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెజ్జు దుర్గా వెంకట సుబ్బారావు, వెజ్జు నాయుడు, లింగంపల్లి మణికంఠ, యెగ్గిన మధు తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: తడికలపూడిలో నిర్మించిన వంగవీటి మోహనరంగ కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, శిల్పి డి.రాజ్‌కుమార్ ఉడయార్, డీసీసీబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, కిలారు సత్యనారాయణ, రంగా మిత్రమండలి నాయకులు తూతా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: నేటి రాజకీయ నేతలు రంగా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. దిప్పకాయలపాడు, కొయ్యలగూడెంలో రంగా జయంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన టీడీపీ, బీజేపీ నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.


చింతలపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

● జీలుగుమిల్లి: రంగా విగ్రహానికి జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు యువత కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కె.సత్యనారాయణ, ఎస్.సాయి, పి.ప్రసాద్, కె.ధర్మరాజు, ఎ.పండు వి.ధనుంజయ, సీహెచ్.శ్రీను, ఆర్.నాని, ఆర్.రాము బి.అనిల్ ఉన్నారు.

● చింతలపూడి: పాత బస్టాండ్ వద్ద వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. టి.నాగవిజయ్‌కుమార్, కొత్తపూడి శేషగిరిరావు, తోటా నాని, పక్కాల వెంకటేశ్వరరావు, సిహెచ్ మధుబాబు, అనిష్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొనగా, అన్నసమారాధన నిర్వహించారు.

● భీమడోలు: భీమడోలు సంత మార్కెట్‌లో వంగవీటి రంగా విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువతకు ఆయన స్ఫూర్తిదాయకమని కొనియాడారు. హరీష్, దోసనపూడి పుల్లయ్య, పెద్దిరాజు, కాపు సంఘం నేతలు పాల్గొన్నారు. భీమడోలు కాపు యువత ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కాపు సంఘ నేతలు, యువకులతో పాటు స్థానిక నేతలు వగ్వాల విజయభాస్కర్, కాళీ బాబు, పుప్పాల శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రత్తి మదన్‌తోపాటు టీడీపీ నేతలు, జనసేన నేతలు, పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ నుంచి నగదు చోరీ

» పట్టుకుని పోలీసులకు అప్పగించిన దేవస్థానం సెక్యూరిటీ

ద్వారకాతిరుమల, జూలై 4: చినవెంకన్న ఆలయ ప్రాంగణంలోని ఓ హుండీలో చేయిపెట్టి నగదును తస్కరించిన వ్యక్తిని ఆలయ మహిళా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం అతడి నుంచి నగదును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ జి.సతీష్ తెలిపిన వివరాలివి.. చింతలపూడిలోని ఆంథోనినగర్‌కు చెందిన దుడ్డి పవన్‌కుమార్ గురువారం ఉదయం క్షేత్రానికి వచ్చి 11.30 గంటల సమయంలో అనివేటి మండపం వద్దనున్న హుండీలో చేయిపెట్టాడు. దీన్ని చూసిన దేవాలయ సెక్యూరిటీ సిబ్బంది అల్లాడ ధర్మావతి అతడిని పట్టుకుని, అతడి వద్ద వున్న రూ.500 నగదును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు, ఇప్పటికే అతడిపై పది కేసులు వరకు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సెక్యూరిటీ ధర్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 4: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిలైన ఎన్‌సీసీ, క్రీడా విభాగాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను గురువారం నిర్వహించారు. ఇందులో ఎన్‌సీసీ విభాగంలో 590, క్రీడా విభాగంలో 350 మంది విద్యార్థులు హాజరైనట్లు అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న గ్రామస్థులు

కైకలూరు, జూలై 4: ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి క్షత్రియ యూత్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని హెచ్ఎం లక్ష్మీ రాజేశ్వరీ అన్నారు. భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామస్థులు గొట్టుముక్క రంగరాజు, నంబూరి వెంకటకృష్ణంరాజు, దండు రాము, ముదునూరి నాగరాజు, పెన్మెత్స సుబ్బరాజు, రుద్రరాజు పాల్గొన్నారు.

● మండవల్లి : మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూటమి నాయకులు వితరణతో చాపరాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కైకలూరు నియోజక వర్గం జనసేన నాయకుడు వర్రే హనుమాన్ ప్రసాద్, మండవల్లి మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, కూటమి నాయకులు నల్లమోతు పాండు, గుడివాడ మురళీ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారానికి కొదవ లేదు

కైకలూరు, జూలై 4: పేదలకు మంచి పని చేసేందుకు దాతల సహకారానికి కొదవ ఉండదని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం కామినేనికి అభినందన సభ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి ఆధ్వర్యంలో కామినేనిని ఘనంగా సత్కరించారు. మంత్రి తల్లి కామినేని రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం ప్రతి నెలా ఆయన ఆర్థిక సహకారంతో వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, టీడీపీ నాయకులు నర్సిపల్లి అప్పారావు, పూల రామచంద్రరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ లక్కోజు సురేష్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దాకరం మాజీ సర్పంచ్ శివాజీరావు మృతి



ముదినేపల్లి, జూలై 4 : కొంత కాలంగా అస్వస్థతో ఉన్న టీడీపీ సీనియర్ నేత, దాకరం గ్రామ మాజీ సర్పంచ్ వల్లూరిపల్లి శివాజీరావు చౌదరి బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. సర్పంచ్‌గా, దాకరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా వ్యవహరించి పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలో తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కొడాలి వినోద్, చాపరాల దుర్గా ప్రసాద్, దుక్కిపాటి శేషుబాబు, కోడూరు శేషుబాబు, హనుమార పేర్నీడు తదితరులు శివాజీ రావు భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన అంత్యక్రియలను దాకరంలో గురువారం నిర్వహించారు.

పాఠశాలలో జంగిల్ క్లియరెన్స్

ముసునూరు, జూలై 4: ముసునూరు జడ్పీ పాఠశాలలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని ఇంచార్జి హెచ్ఎం పి.వాణి కుమారి పర్యవేక్షణలో గురువారం తొలిగించారు. కనీసం విద్యార్థులు మూత్రశాలకు వెళ్లేందుకు వీలు లేకుండా మరుగుదొడ్లు చుట్టూ చిట్టడవిని తలపించేలా ఉన్న జంగిల్‌ను ఉపాధి కూలీల సహకారంతో తొలిగించి శుభ్రం చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో నిలిచిన నీటి నిల్వలను తోడించి, బ్లీచింగ్ చల్లించారు. ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్, యువరాజు పాల్గొన్నారు.

బాలుడికి డెంగీ నిర్ధారణ

ముసునూరు, జూలై 4: ముసునూరు సగరుల కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పేరిచర్ల వెంకటేశుకు డెంగీ నిర్ధారణ అయింది. అయితే బాలుడి ఆరోగ్యం నిలకడగానే ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి షీకీనా ఇవాంజలి గురువారం తెలిపారు. జర్వంతో ఉన్న బాలుడిని శనివారం పీహెచ్‌సీకి తీసుకు వచ్చారని, చికిత్స అందించి నూజివీడు ప్రభుత్వాసుపత్రి రిఫర్ చేయగా, బాలుడి తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారని వైద్యులు తెలిపారు. అక్కడ చికిత్సకు డబ్బులు భరించలేక, సోమవారం బాలుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారని, వైద్యులు పరీక్షలు నిర్వహించి, డెంగీ అని నిర్ధారించినట్లు వైద్యాధికారిణి ఇవాంజలి తెలిపారు. ప్రస్తుతం బాలుడికి చికిత్స కొనసాగుతుందని, ఆరోగ్యం నిలకడగానే ఉందని, రెండు రోజుల్లో డిచార్జ్ చేస్తామని ఏలూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు తెలిపారని ఆమె చెప్పారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి

చాట్రాయి, జూలై 4: గ్రామ పంచాయతీల నిధులలో కొంత శాతం పారిశుధ్యం, తాగునీటికి నిల్వ ఉంచి, వర్షాకాలంలో పనులు చేయవల్సిందే అని, నిధులు లేవని చెబితే కుదరదని నూజివీడు డీఎల్‌పీవో సుందరి అన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు త్వరలోనే నిధులు విడుదల అవుతాయని సర్పంచ్‌లకు చెప్పి పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. సీజనల్ జ్వరాలు డయేరియా వ్యాపించకుండా గ్రామాల్లో చెత్తకుప్పలు తొలిగించాలని, మురుగునీరు నిల్వ ఉండకుడా చూడాలని, తాగునీరు క్లోరినేషన్ చెయ్యాలని, ప్రజలు ఉపయోగించే తాగునీరు పరీక్ష చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగాకుమారి పాల్గొన్నారు.

గేదె అడ్డురావడంతో.. యువకుడికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తీసుకువెళుతున్న ఎస్సై రామకృష్ణ

కైకలూరు, జూలై 4: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఎస్‌ఐ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలను అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండవల్లికి చెందిన తెంటు హేమంత్ అనే యువకుడు కైకలూరు మండలం ఆటపాకలో గురువారం జాతీయ రహదారి వెంబడి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఆ సమయంలో గేదె అడ్డురావడంతో ప్రమాదవశాత్తూ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయం లో అటుగా వెళుతున్న కైకలూరు రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ హుటాహుటిన యువకుడిని తన జీపులో కైకలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకువెళ్లారు. ప్రమాదం జరిగిన ప్రదేశం కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తున్నప్పటికీ స్టేషన్ పరిధిని పరిగణలోనికి తీసుకోకుండా ఎస్‌ఐ యువకుడిని ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో ఆ ప్రాంత ప్రజలు అభినందనలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.



భుజబలపట్నంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని, తదితరులు



గురజలో అల్లూరికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముదినేపల్లి కూటమి నేతలు



కలిదిండిలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



చిన్నంపేటలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అల్లూరి చిరస్మరణీయుడు

ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు

కైకలూరు, జూలై 4: అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా భుజబలపట్నంలో క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో గురువారం అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షత్రియ సేవా సంఘం నాయకులు పేరిచర్ల రామ రాజు, జంపన రాము, గాదిరాజు భాస్కరరాజు, ఆర్‌వీ సూర్యనారాయణ రాజు, అల్లూరి కృష్ణమోహనరాజు, ముదనూరి సీతారామ రాజు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొన్నారు.

● ముదినేపల్లి :మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాట పటిమ, ఆత్మస్థైర్యం నేటి యువతకు ఆదర్శం కావాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. రాజానగరం గ్రామంలో క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతా రామరాజు జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. సంఘ నాయకులు కొండ రాజు, సుబ్బరాజు, రవిరాజుతో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. గురజ గ్రామంలో కొండ దొరల లోకాలిటీలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, బీజేపీ, జనసేన నాయకులు కోటప్రోలు కృష్ణారావు, వీరంకి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కలిదిండి : తాడినాడలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నంబూరి వెంకట రామరాజు, సూర్యనారాయణ రాజు, సుబ్బరాజు, నరసింహరాజు పాల్గొన్నారు. కలిదిండిలో ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం నాయకులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహంకాళిరావు, మహేష్, రాజేష్, పాల్గొన్నారు. భాస్కరావుపేట, కొండంగి గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామరాజు, కోకా రమేష్, సతీష్ రాజు పాల్గొన్నారు. కలిదిండి గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమర యోధుడు మన అల్లూరి అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

● చాట్రాయి : మండలంలోని చిన్నంపేట సెంటర్‌లో, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ నుంచి సెంటర్ వరకు విద్యార్థులు, పౌరులు ర్యాలీ నిర్వహించి అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి హెచ్ఎం వెంకట్రావు విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మన్యం సేనలతో బ్రిటీష్ దొరలపై అల్లూరి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ వలగాని శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, యువజన సంఘం మండల నాయకుడు లింగోజు వంశీ పాల్గొన్నారు.

● మండవలి : భైరవపట్నంలో అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకుని విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. పెన్మెత్స నరసింహరాజు, గాదిరాజు భాస్కర వర్మ, కనుమూరి శ్రీనివాసరాజు, వేగేశ్న సుబ్బరాజు, రుద్రరాజు శివకుమార్‌రాజు, అల్లూరి కృష్ణంరాజు, అల్లూరి సత్యనారాయణరాజు, పెన్మెత్స ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలు

» అభివృద్ధే నా ఎజెండా : మంత్రి కొలుసు

» నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, జూలై 4 : 'ఎన్నికల వరకే రాజకీయాలు, అనంతరం నూజివీడు పట్టణ అభివృద్ధే నా అజెండా..' అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన మునిసిపల్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో మంత్రి సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. రింగ్ రోడ్డు ఏర్పాటుతో ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఇప్పటికే అధికారులను భూ సేకరణ చేయాలని ఆదేశించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు డీపీఆర్ తయారు చేయించి, కేంద్రప్రభుత్వం ద్వారా నిధుల సమీకరణకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పట్టణానికి సుదూరంగా ఎస్సీలకు నివేశనా స్థలాలు ఇచ్చి, తమను దూరం పెట్టి అన్యాయం చేశారని, గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని మంత్రి పార్థసారథి సరిదిద్దాలని వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు కోరారు. ఆయన విజ్ఞప్తిని మన్నించాల్సిందిగా టీడీపీ కౌన్సిలర్లు కూడా మంత్రిని కోరడంతో త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ప్రతిపాదనలు చేయడంపై కౌన్సిలర్ శీలం రాము ఏ హోదాలో తన వార్డులో ప్రతిపాదనలు చేస్తారంటూ నిలదీశారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ కల్పించుకుని గతంలో జరిగిన వాటిని మర్చిపోయి నూజివీడు అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామంటూ సర్దిచెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది. అంతకు ముందు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా మంత్రి సారథితో కమిషనర్ వెంకటరామిరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కౌన్సిల్ సభ్యులు ఆయన పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు.

రూ.ఐదు లక్షల విరాళం

నూజివీడు డీఎస్పీ కార్యాలయం నిర్మాణ పనులకు బాపులపాడు మాజీ సర్పంచ్ కాకాని బాబు రూ.ఐదు లక్షల విరాళాన్ని మంత్రి పార్థసారథి చేతుల మీదుగా నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్యకు అందజేశారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయండి



మంత్రితో ముద్దరబోయిన తదితరులు

నూజివీడు టౌన్, జూలై 4: ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల జీవనాడిగా పేరొందిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడిని గురువారం కలిసి అభినందించారు. చింతలపూడిని త్వరితగతిన పూర్తి చేసి ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లోని నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో గల నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించి, స్థిరీకరించాలని ముద్దరబోయిన, మంత్రి రామానాయుడిని కోరారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రోడ్డు అభివృద్ధి



రాజానగరం వద్ద రోడ్డు అభివృద్ధి పనులు చేయిస్తున్న దాతలు

ముదినేపల్లి, జూలై 4 : ముదినేపల్లి-భీమవరం ఆర్ అండ్‌బి ప్రధాన రహదారిలో సింగరాయపాలెం నుంచి అల్లూరు వరకు పడిన ప్రమాదకరమైన గోతులను పూడ్చేందుకు పలువురు దాతలు ముందుకొచ్చారు. ఈ రోడ్డులో సుమారు ఎనిమిది కిలో మీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రాజానగరం క్షత్రియ యూత్, పారిశ్రామిక వేత్త కోసూరి రవిరాజు, స్థానిక టీకేఆర్ అండ్ కేకేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. దాతలు రోడ్డు అభివృద్ధి చేపట్టడం అభినందనీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, దావు నాగరాజు, బొంగు రవికుమార్, జనసేన నాయకుడడు ఏఎస్.బాబు దాతలను అభినందించారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు

చాట్రాయి, జూలై 4 : పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం గురించి పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని మంత్రి పార్థసారథి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషజ్వరాలు ప్రబలిన మండలంలోని చీపురుగూడెం గ్రామంలో గురువారం మంత్రి పర్యటించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రక్షిత తాగునీటి పథకాన్ని పరిశీలించారు. ట్యాంకును శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ భాస్కరరెడ్డిని, బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీవో మంగాకుమారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజును, చనుబండ పీహెచ్‌సీకి ప్రజలకు సౌకర్యంగా ఉండే స్థలాని సేకరించాలని తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీని మంత్రి ఆదేశించారు. జ్వరాలు ప్రబలడానికి కారణం ఏమిటని డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్టను మంత్రి ప్రశ్నించగా దోమలు, తాగునీరు కలుషిత వలన జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. మూడు రోజుల్లో పరిస్థితిలో మార్పురాకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. జిల్లా డిసీజ్ సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, డీఎల్‌పీవో సుందరి, డీపీహెచ్‌వో విజయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు బొట్టు రామచంద్రరావు, అన్ని గ్రామాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ



విద్యా బోధనను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ముసునూరు, జూలై 4: గ్రామంలోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని నూజివీడు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల రక్షణ విషయంలో సిబ్బందిపై స్థానికులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన విచారణ చేశారు. హస్టల్ విద్యార్థులు బయట తిరుగుతున్నారని, వారికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఫిర్యాదు చేస్తుంటే సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టమవుతుందన్నారు. పద్ధతి మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది తీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి, పిల్లలను హస్టల్ నుంచి బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి వార్డెన్ వెంకటరమణను ఆదేశించారు. మెను ప్రకారం ఆహారాన్ని పెట్టాలని, అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అనంతరం పదో తరగతి బాలికలకు అందిస్తున్న విద్యా బోధనను ఆయన పరిశీలించారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఆగిరిపల్లి, జూలై 4 సింగన్నగూడెం బస్టాప్ వద్ద గల సర్వకార్యసిద్ధి సాయిబాబా మందిరంలో 15వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు దేవులపల్లి మూర్తి తెలిపారు.

వైసీపీ అండతో పొజిషన్ సర్టిఫికెట్లు



పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న పక్కా ఇల్లు

ఆగిరిపల్లి, జూలై 4 : అర్హత లేనప్పటికి ఇవ్వాల్సిన పరిస్థితి లేనప్పటికి వైసీపీ నాయకుల అండతో అప్పటి తహసీల్దార్ ఉదయభాస్కర్ ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్లు కలకలం రేపుతున్నాయి. ఆగిరిపల్లి జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల నుంచి మార్కెట్ యార్డు గేటు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న రోడ్డు పోరంబోకు భూమిలో కొంతకాలంగా ప్రజలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తు న్నారు. ఆ క్రమంలో ఇటీవల వైసీపీ నాయకులు అప్పటి ఎమ్మెల్యే సహకార ంతో వారు ఉంటున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. ఈ సర్టిఫికె ట్లు అడ్డుపెట్టుకుని బ్యాంకులలో రుణాలు తెచ్చుకుని ఇళ్లు కూడా నిర్మించు కున్నారు. దీంతో ఇక్కడ 40 ఏళ్లుగా ఉంటున్న వారు తమకి పొజిషన్ సర్టిఫికె ట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం కావాలని మంత్రి కొలుసు పార్థసారథి వద్దకు మండల బీసీ నాయకుడు ఆరేపల్లి శ్రీనుతో వెళ్లగా పేద కుటుంబాలకు భరోసా ఇస్తానన్నారు. తహసీల్దార్ ఉదయ భాస్కర్ పొజిషన్ సర్టిఫికెట్లు ఏలా ఇచ్చారో తెలుసుకోమని ఆదేశించారు. ఈ రోడ్డులో శాశ్వత భవనాలు నిర్మించారని, రోడ్డు విస్తరణ సమయంలో ఇవి అడ్డువస్తాయని స్థానికులు చెబుతున్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



ధర్నా చేస్తున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 4: నీట్ పేపర్ లీకేజిల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ విధానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బంద్ నూజివీడు లో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) ఆధ్వర్యంలో నూజివీడు బాలికోన్నత పాఠశాల, ఎస్‌ఆర్‌ఆర్ బాలుర పాఠశాల వద్ద విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐసా జిల్లా కార్యదర్శి గరికె అఖిల్ మాట్లాడుతూ దేశంలోని విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందన్నారు. ఐసా నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి రియాజ్, నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

కలిదిండి, జూలై 4 : పెదకొమ్ములేరుపై వంతెన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం పోతుమర్రు-కొండూరు వంతెన శ్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ కూలిన వంతెన శిథిలాలను తొలగించటం కష్టతరంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ వీర్ల వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖుడు నంబూరి భీమరాజు చొరవతో వంతె నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కూలిన వంతెనను 20 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మాణం చేసి శ్లాబ్ దశకు తీసుకొని రావడం అభినందనీయమన్నారు. 20 రోజుల్లో వంతెనపై రాకపోకలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట కృష్ణ, డీఈఈ విజయశ్రీకర్, కూటమి నాయకులు తాడినాడ బాబు, నంబూరి భీమరాజు, బలరామరాజు, కొల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన సైబర్ నేరస్థుడు



పొన్నగంటి తేజ్‌కుమార్

ముసునూరు, జూలై 4: సైబర్ నేరాల్లో ఆరితేరిన యువకుడిని గురువారం ముసునూరు పోలీసులు పటుకుని, సైబర్ పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల రెండున రమణక్కపేటలో పేకాట శిబిరంపై దాడి చేయగా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన పొన్నగంటి తేజ్‌కుమార్ పట్టుపడగా, కేసు నమోదు చేశామన్నారు. అయితే సోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న వరంగల్ సైబర్ పోలీసులు తేజ్‌కుమార్ చేసిన సైబర్ నేరాలు, అతనిపై నమోదైన కేసులు గురించి సమాచారం అందించారని ఎస్‌ఐ తెలిపారు. నిందుతుడు తేజ్‌కుమార్‌ను చాట్రాయిలో అదుపులోకి తీసుకుని, సైబర్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.



కైకలూరులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



నూజివీడులో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ముదినేపల్లిలో వంగవీటి రంగాకు నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు



కోరుకొల్లులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమ్మిలి తదితరులు

పేదల మనిషి రంగా

వంగవీటి రంగాకు ఘన నివాళులర్పించిన పలువురు నేతలు

కైకలూరు, జూలై 4: వంగవీటి మోహనరంగా 77వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు, ఆటపాక గ్రామాల్లోని రంగా విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కైకలూరు గాంధీబొమ్మ సెంటర్లో అన్నదానం నిర్వహించారు. అలాగే తాలుకా సెంటర్లోని అన్న క్యాంటీన్ వద్ద కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు కేవీఎన్ఎం నాయుడు, కొల్లి వరప్రసాద్, రామిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి వంగవీటి మోహన్ రంగా అని, ఆయన చూపిన బాటలో పయనిస్తూ ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని, మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాధా,రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వంగవీటి రంగా విగ్రహానికి మిత్ర మండలి సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించి, జయంతి వేడుకలను నిర్వహించారు. టీడీపీ నాయకులు, మల్లిశెట్టి బాబి, పగడాల సత్యనారాయణ, కోటగిరి గోపాల్, కొండా వెంకట్రావు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : వంగవీటి రంగా జయంతి సందర్భంగా గ్రామంలోని రంగా విగ్రహానికి టీడీపీ నాయకులు కొడాలి వినోద్, వీరమల్లు నరసింహరావు, శ్రీహరిపురం గ్రామ సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పోసిన పాపారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, ఏఎస్ బాబు, మోటేపల్లి హనుమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్మినంపాడు, వాడవల్లి, గురజ, నారాయణపురం, సింగరాయపాలెం, వైవాక గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించగా, వాడవల్లిలో రాధా - రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● కలిదిండి : కోరుకొల్లు, కలిదిండిల్లో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోరుకొల్లులో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, కూటమి నాయకులు వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బడుగుల బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన రంగా చిరస్మరణీయుడని కొనియాడారు. కోరుకొల్లు సర్పంచ్ లీలా కనకదుర్గ, నాయకులు చెన్నంశెట్టి మురళీ కృష్ణ, వలవల రామారావు, కేశిరెడ్డి బలరామ్, వలవల రమేష్, నల్లగోపుల చలపతిరావు, సిరిపురపు రాజబాబు, కొశిరెడ్డి, రాజేష్, శ్రీరామకృష్ణ, ఆమజాల బాబులు, నున్న సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : రంగా 77వ జయంతిని బస్టాండ్ సెంటర్లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేసి పేదలకు మిఠాయిలు పంచారు. జనసేన పార్టీ నాయకులతో పాటు ఆగిరిపల్లి టీడీపీ నాయకులు పాలొన్నారు.. ఆగిరిపల్లి మండల జనసేన నాయకులు ముక్కు మహేష్, సముద్రాల కిరణ్, సంగా రంగారావు, సముద్రాల ఏడుకొండలు, టీడీపీకి చెందిన చవటపల్లి విక్టర్, బెజవాడ శ్రీనివాస్, పామర్తి నరసయ్య, ముల్లంగి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

● మండవల్లి : మండవల్లిలో రంగా జయంతి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకుడు వర్రే హనుమాన్ ప్రసాద్, మండవ్లల మండల జనసేన నాయకుడు బోయిన రాజేష్, ఎన్డీయే నాయకులు గుడివాడ చిట్టిబాబు, గుడివాడ బాలాజీ, ముళ్లపూడి సత్తిబాబు, పాల్గొన్నారు.

● ముసునూరు : రావిచెట్టు సెంటర్‌లో వంగవీటి కాపు నేతలు మంగిశెట్టి పవన్‌కుమార్, కోనేరు అనిల్, కొల్లి పోతురాజు, గిరి గోపి, కోనేరు సాయి తదితరులు రంగా జన్మదిన కేక్‌ను కట్ చేశారు,